

స్వామివారికి హారతినిస్తున్న అర్చకుడు

## వైభవంగా లక్ష్మీనరసింహుడికి నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 : యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామికి శుక్రవారం నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు దర్శనబాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను ద్యివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవను, ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి తిరువరాధన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 9 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.16,09,975 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామ కృష్ణారావు తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

## పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : సంప్రదాయ చేతివృత్తులు, హస్త కళాకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం పథకం అమలు కోసం ఏర్పాటు చేసిన జిల్లా అమలు కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. పథకం అమలు పట్ల గ్రామ, పట్టణ స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపరిచి ఉత్పాదకత నాణ్యత, ఉత్పత్తులను పెంచడం ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. పథకంలో చేరడం వల్ల విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డుతోపాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకునేందుకు కావాల్సిన శిక్షణ, టూల్ కిట్స్, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుందని చెప్పారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలి, మంగళి, ఉప్పరి, ఎరుకల, దర్జీ, చీపుర్లు, బుట్టలు, బొమ్మలు, తాళాల తయారీ, బార్బర్, చెప్పులు కుట్టేవారు, పనిముట్లు, శిల్పి, స్వర్ణకారులు, ధోబీ, చేపల వల, దండలు చేసేవారు, తాపీ పని లాంటి 18 కులవృత్తులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తుందని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన వారు కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులని, విద్యార్హత లేకున్నా పేరు నమోదు చేసుకోవచ్చని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఉండరాదని తెలిపారు. విశ్వకర్మగా పేరు నమోదు కోసం సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, మొబైల్ నంబరుతో రిజిస్టర్ చేసుకోవాలని, దరఖాస్తులను గ్రామ పంచాయతీ స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయి అమలు కమిటీకి పంపుతుందని చెప్పారు. ఎంపికైన వారికి రెండు రకాలుగా శిక్షణ ఇస్తారని, ప్రాథమిక నైపుణ్యం ద్వారా 5 నుంచి 7 రోజులు, అధునాతన నైపుణ్యానికి 15 రోజులు శిక్షణ ఉంటుందని అన్నారు. శిక్షణ కాలంలో ప్రతి రోజూ రూ.500 భృతి ఇవ్వడంతోపాటు శిక్షణ అనంతరం రూ.15 వేల విలువైన టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రం అందిస్తారని చెప్పారు. రెండు విడుతలుగా రూ.లక్ష, రూ.రెండు లక్షలు కలిపి మొత్తం రూ.మూడు లక్షల వరకు రుణం అందజేస్తారని అన్నారు. మొదటి విడుతలో 5 శాతం వడ్డీతో రూ.లక్ష రుణం ఇస్తారని, 18 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని, రెండో విడుతలో రూ.2 లక్షలు ఇస్తారని, 36 నెలల వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దశల వారీగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన అందరికీ లబ్ధి చేకూర్చాలని, ఇందుకోసం విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, సహాయ సంచాలకులు సుమతి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేశ్‌బాబు, లీడ్ బ్యాంక్ అధికారి రామకృష్ణ, బీసీ అభివృద్ధి అధికారి యాదయ్య పాల్గొన్నారు.

## ఎంజీయూలో జాబ్ మేళాకు విశేష స్పందన




జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

రామగిరి, ఫిబ్రవరి 9 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ అధికారి వై.ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, ఎంబీఏ పూర్తి చేసిన 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి హెటిరో డ్రగ్స్, కామినేని మెడికల్ సైన్సెస్ వారు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 50 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ సెల్ అధికారి ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులకు అవకాశం కల్పించిన వర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల హెచ్‌ఆర్‌లు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గురుకుల ఆద్యుడు మన పీవీ

## సర్వేల్‌లో తొలి గురుకులానికి అంకురార్పణ చేసిన నర్సింహారావు

- నల్లగొండతో విడదీయరాని అనుబంధం
- స్వాతంత్య్ర సమరయోధులు, భూదానోద్యమ నేతలు, జిల్లా కాంగ్రెస్ ముఖ్యులతో సత్సంబంధాలు
- చకిలం శ్రీనివాసరావు విగ్రహాష్కరణకు హాజరు
- పీవీకి భారతరత్నపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు





సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాల

**తెలుగు నేల నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మాజీ ప్రధాన మంత్రి, బహుభాషావేత్త పాములపర్తి వెంకటనర్సింహారావుకు ఎట్టకేలకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. పొరుగు జిల్లా వరంగల్ జిలాలో పుట్టిన పీవీ నర్సింహారావుకు నాటి నీలగిరిగా ఉన్న నేటి ఉమ్మడి నల్లగొండ జిల్లాతో విడదీయరాని అనుబంధమే ఉన్నది. పీవీ ఆలోచనతో మొగ్గ తొడిగిన గురుకుల విద్యకు నల్లగొండ జిల్లా నుంచే నాంది పలికారు. సర్వేల్ గురుకుల పాఠశాలను పీవీ స్వయంగా ప్రారంభించడం చరిత్రలో మరుపురాని ఘట్టం.**

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో రాజకీయ దురంధరుడిగా పేరొందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు సామాజికంగా, రాజకీయంగా మంచి సంబంధాలు ఉన్నాయి. జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులతోపాటు భూదానోద్యమ నేతలు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలతో మంచి అనుబంధమే ఉన్నది. మాజీ ఎమ్మెల్యే కాంచనపల్లి చినవెంకటరామారావు, ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు పులిజాల రంగారావు లాంటి వారితో కుటుంబ సంబంధాలు ఉన్నాయి. ఇక జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా ఉన్న చకిలం శ్రీనివాసరావుతో తొలినాళ్లలో రాజకీయంగా ఏర్పడిన అనుబంధం... ఆత్మీయంగా మారి చివరి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలోనే చకిలం శ్రీనివాసరావు మృతి అనంతరం నల్లగొండలో 1998 జూలై 18వ తేదీన జరిగిన చకిలం విగ్రహావిష్కరణకు మాజీ ప్రధాని హోదాలో పీవీ నర్సింహారావు హాజరయ్యారు. పీవీ వస్తున్నాడని తెలిసి వేలాది మంది ప్రజలు ఆ సభకు తరలిరావడం అప్పట్లో విశేషంగా మారింది. అదే రోజు తన ఆత్మీయులుగా ఉన్న పులిజాల రంగారావు ఇంటికి పీవీ వెళ్లి పలుకరించి తన ఉన్నత వ్యక్తిత్వాన్ని మరోసారి చాటుకున్నారన్న చర్చ వినిపించింది. ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి లాంటి సీనియర్ నేతలు పీవీ నర్సింహారావుతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు.

### పీవీ చేతుల మీదుగా సర్వేల్ గురుకులం

స్వతహాగానే విద్యాధికుడు అయిన పీవీ నర్సింహారావు విద్య అందరికీ అందాలన్న ఉన్నత ఆశయంతో గురుకుల విద్యకు శ్రీకారం చుట్టారు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లో మొట్టమొదటి గురుకులాన్నీ ముఖ్యమంత్రిగా ఉన్న పీవీ నర్సింహారావు 1971 నవంబర్‌లో తన స్వయంగా ప్రారంభించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ గురుకుల ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసి అనేక గురుకులాలతో బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టారు. ఆ తర్వాత గురుకులాల స్ఫూర్తి దేశవ్యాప్తంగా పాకింది. పీవీ నర్సింహారావు ఆలోచన దేశానికి ఆదర్శంగా నిలిచిందనడంలో సందేహం లేదు.

### నెరవేరిన డిమాండ్..

పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నది. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అసెంబ్లీలో తానే స్వయంగా తీర్మానం ప్రవేశపెడుతూ భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి పంపించారు. ఎట్టకేలకు పీవీకి భారతరత్న ప్రకటించడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పీవీకి భారతరత్నపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో జన్మించిన పీవీకి దక్కిన గౌరవం యావత్ తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## పీవీకి భారత రత్నతో తెలంగాణ జాతికి గౌరవం దక్కింది

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 9 : దేశ మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న దక్కడం చాలా సంతోషంగా ఉందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జన్మించిన పీవీ దేశ అత్యున్నత ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగినందున ఆయన భారత రత్నకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. పీవీకి దక్కిన గౌరవం యావత్ తెలంగాణకే దక్కినట్లు తెలిపారు. బహుభాషా కోవిదుడుగా పేరుగాంచిన ఆయన దేశంలో ఎన్నో సంస్కరణలు అమలు చేసి గొప్ప వ్యక్తిగా నిలిచారని గుత్తా అభివర్ణించారు.

## రేవంత్‌రెడ్డి గుండెలదిరేలా చలో నల్లగొండ సభ

- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 9 : నల్లగొండ ప్రజల గొంతులు ఎండ బెట్టడానికి ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుండెలు అదిరేలా చలో నల్లగొండ సభ నిర్వహించనున్నామని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాకలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మునుగోడు ఇన్‌చార్జి శ్రీధర్, రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతితో కలిసి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ పది సంత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడువక ముందే కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఎన్నో ఉద్యమాలు చేసి తెచ్చుకున్న తెలంగాణను ఆంధ్రాకు, కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామాని హెచ్చరించారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు నల్లగొండ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని వెంకాంబావితండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రమావత్ శ్రీను ఇటీవల మరణించడంతో రూ.2లక్షల బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య, నాయకులు ఆడెపు పరదేశి, వీరమళ్ల వెంకటేశ్, మన్నె ఇంద్రసేనా రెడ్డి, దోనూరి జైపాల్ రెడ్డి, శివరాత్రి సాగర్, జక్కిడి జంగారెడ్డి, సుర్వి యాదయ్య, గడ్డం మురళీధర్ రెడ్డి, ధన్వంత్‌రెడ్డి, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నాయకులు పాల్వాయి స్రవంతి, శ్రీధర్

# రైతు బంధు ఇంకెప్పుడు?

## సాగు పనులు పూర్తయినా సాయం అందని దుస్థితి

**జిల్లాలో సగం కూడా పూర్తికాని చెల్లింపులు**

- **1,81,063** మంది రైతులకే పెట్టుబడి సాయం
- ఇంకా **90,524** మంది ఎదురుచూపులు
- రూ. 304 కోట్లలో రూ. 112 కోట్లే జమ
- మిగిలిన రూ. 192 కోట్లు ఎప్పుడిస్తరో..?
- సర్కారు తీరుపై అన్నదాత ఆగ్రహం



పోచంపల్లిలో పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

**‘అది యాసంగి సీజన్. రైతులు నాట్లు వేయడం కూడా ప్రారంభించ లేదు. అప్పడప్పడే పొలంలోకి దిగి దుక్కులు దున్నుతున్నారు. జేబులో ఉన్న ఫోన్‌కు టింగ్ టింగ్ అని మెసేజ్ వచ్చింది. ఏంటని చూస్తే రైతుబంధు పెట్టుబడి సాయం డబ్బులు..’ ఇదీ గతేడాది యాసంగి సీజన్‌లో అన్నదాతలకు ప్రభుత్వం జమ చేసిన తీరు. సకాలంలో పెట్టుబడి సాయం అందడంతో సంతోషంగా సాగు పనులు చేసుకున్నారు. కానీ ఈ సారి పరిస్థితి తారుమారైంది. యాసంగి సీజన్ సగం ముగిసినా, పొలం పనులు పూర్తయ్యినా, ఎండాకాలం సమీపిస్తున్నా ఇంకా రైతుబంధు డబ్బులు జమ కాలేదు. జిల్లాలో సగం చెల్లింపులు కూడా కాలేదు. దాంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.**

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)

కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం రైతుబంధు పథకం తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఏటా రెండు సార్లు ఎకరాకు రూ. 5వేల చొప్పున పెట్టుబడి సాయం డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. ఎకరా నుంచి మొదలుకొని అర్హులు అందరికీ ఇచ్చేది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏటా ఎకరాకు రూ. 15వేల సాయం చేస్తామని హామీ ఇచ్చింది. అంతేకాకుండా కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తామని వాగ్దానం చేసింది. అది కూడా డిసెంబర్ 9వ తేదీన ఇస్తామని ప్రకటించింది. కానీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ఏటా రూ. 5వేలు జమ చేసినట్లే ఇస్తామని ప్రకటించింది. కొత్త నిబంధనలు రూపొందించలేదనే సాకుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధును అమలు చేసింది. ఇప్పుడు పాత పద్ధతి ప్రకారం ఇచ్చే డబ్బులు కూడా ఇవ్వడం లేదు.

### సగం కూడా చెల్లించలే..

ఈ సీజన్‌లో జిల్లాలో 2,71,590 మందికి రైతుబంధు పెట్టుబడి సాయం అందించాల్సి ఉంది. ఇందుకు రూ. 304 కోట్లు అవసరం కానున్నాయి. గతంలో మాదిరిగా మొదటగా చిన్న, సన్నకారుల రైతులకు ప్రాధాన్యం ఇస్తారని, దశల వారీగా మిగతావారికీ అందిస్తారని పేర్కొంటున్నారు. జిల్లాలో 13వ తేదీ నుంచి ఖాతాల్లో పెట్టుబడి సాయం జమం చేయడం ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా డబ్బులు మాత్రం రైతుల ఖాతాల్లో వేయడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో 1,81,063 మంది రైతులకు రూ. 112,10,67,414 మాత్రమే అకౌంట్లలో డిపాజిట్ అయ్యాయి. ఇంకా 90,524 మందికి రూ. 192,67,78,376 డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఇవి కూడా ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

### సాగు పనులు పూర్తయినా..!

జిల్లాలోని పలు చోట్ల యాసంగి సాగు పనులు పూర్తయ్యాయి. ఈ సారి 2,61,105 ఎకరాల్లో పంటల సాగుకు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నెలన్నర రోజులుగా సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారు. పొలాల్లో దుక్కులు దున్నారు. కూలీలను రప్పించి నాట్లు వేయించారు. 2.71లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేయగా, ఇందులో 2.70 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. ప్రస్తుతం రైతులు యూరియా, ఎరువులు చల్లుతున్నారు. అయినప్పటికీ రైతుబంధు డబ్బులు అందకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చేతిలో పెట్టుబడి సాయం లేకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. బ్యాంకుల్లో ఇప్పటికే రుణాలు తీసుకోవడంతో చేసేదేంలేక బయటకు మిత్తీలకు తీసుకున్నారు. ఇంకొందరు బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకుని కాలం వెల్లదీస్తున్నారు.

### పెట్టుబడికి అప్పు చేసిన



కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వరి సాగు పనులు మొదలు పెట్టగానే రైతుబంధు పైసలు వచ్చేవి. అప్పు చేయకుండానే వ్యవసాయం చేసుకునేటోళ్లం. ఈ సారి కాంగ్రెసోళ్లు వచ్చాక నాకున్న మూడున్నర ఎకరాలకు రైతు బంధు పైసలు పడలే. సావుకారు వద్ద అప్పు చేసి పంటకు పెట్టుబడి పెట్టిన. వరి నాటు వేసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికే పైసలు పడకపోవడంతో గుబులు వేస్తుంది. పాత రోజుల్లా కాంగ్రెసోళ్లు రైతులను అప్పుల పాలు చేసేటట్టు అగుపిస్తున్నది. ఇట్నే కొనసాగితే చేసిన అప్పులు తీర్చేందుకు వ్యవసాయం విడిచి పట్నాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది.

–భూక్యా భద్రునాయక్, పుట్టిగూడెం, రాజాపేట మండలం

### రైతుబంధు కరువయ్యింది



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక రైతులకు రైతు బంధు పడటం లేదు. ఇప్పటి వరకు నాకు రైతుబ ంధు పైసలు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంట పెట్టుబడి సాయం సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. వ్యవసాయానికి ఏ రందీ లేకుండేది. నాకున్న రెండు ఎకరాల భూమికి సంబంధించిన రైతు బంధు పైసలు ఎప్పుడు పడుతాయో ఏమో అర్థం కావడం లేదు. రైతులకు ప్రభుత్వం అందుబాటులో ఉండి సేవ చేస్తామని చెప్పి ఇప్పుడు నట్టేటా ముంచుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.

–ప్రశాంత్, రైతు, ఆలేరు

## పీవీకీ భారత రత్న పురస్కారంపై హర్షం



రాజాపేటలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజాపేట, ఫిబ్రవరి 9 : దేశ మాజీ ప్రధాన మంత్రి దివంగత పీవీ నర్సింహారావుకు భాతర రత్న ప్రకటించడంపై శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, మాజీ ఎంపీపీ వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, కుమ్మరి లక్ష్మణ్, మేక రమేశ్, శ్రీనునాయక్, కాసోజు సంపత్‌కుమార్, సంగెం మధు, బీరయ్య, భరత్, శ్రీహరి, కిష్టయ్య, సిద్దులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

చౌటుప్పల్, ఫిబ్రవరి 9 : చౌటుప్పల్‌లోని జయశ్రీ గార్డెన్‌లో శనివారం మధ్యాహ్నం 2గంటలకు బీఆర్ఎస్ మున్సిపల్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈనెల 13న నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బహిరంగ సభ ఇన్‌చార్జి శ్రీధర్ పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.